నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: వివిధ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గగన్ పహాడ్ సబ్ స్టేషన్ పరిధిలోని సాతం రాయి విలేజ్, మీనాక్షిఇండస్ట్రియల్ ఏరియా, సాతంరాయి ఇండస్ట్రియల్ ఏరియా, బీఇ, జైభవాని లేన్ ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, మైలార్‌దేవ్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలోని దుర్గానగర్, గణేష్‌నగర్, శాంతినగర్, టీఎన్జీవోస్ కాలనీ, స్వప్న థియేటర్ ప్రాంతాలలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజినీర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.

అయ్యప్ప మహాపడి పూజ

మణికొండ: నార్సింగి లక్ష్మమ్మ దేవాలయం ఆవరణలో ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి అయ్యప్పస్వామి మహా పడిపూజను నిర్వహిస్తున్నట్టు జల్లి వెంకటేష్ గురుస్వామి తెలిపారు. గురుస్వామి వేదాంతం రాజసింహా చార్యులు చేతుల మీదుగా జరిగే పూజలో గంగపుత్ర నర్సింగ్‌రావు భజన, జల్లి బాలమణి ఏర్పాటు చేసే అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు, అయ్యప్ప మాలాదారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



రామంజాపూర్‌లో పంట నమోదును చేపట్టిన జిల్లా వ్యవసాయధికారి

శంషాబాద్ రూరల్: రైతులు వరి నారు మడుల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సూచించారు. యాసంగి పంటల నమోదులో భాగంగా ఆమె శనివారం మండలంలోని రామంజాపూర్‌లో పర్యటించారు. రైతులకు పలు సూచనలు చేశారు. నారు మడిలో జింకు, ఇనుము లోపం లేకుండా రైతులు జాగ్రతలు తీసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న అన్ని రకాల పంటలను ఆన్‌లైన్‌లో సీబీఈ యాప్ ద్వారా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రామంజాపూర్‌లో సర్వేనంబర్ల ఆధారంగా పంట నమోదు చేపట్టారు. ఏఓ కవిత, ఏఈఓ విజయభారతి, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి వార్డు కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు అరుణ్‌ముదిరాజ్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ శిబిరం ఉంటుందని, కంటి సమస్యలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరాన్ని ప్రారంభించేందుకు మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని ఆయన తెలిపారు.

కిటకిటలాడిన వైష్ణవాలయాలు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు



మంచిరేవుల వేణుగోపాలస్వామి



ఆదిశేష వాహనంపై శ్రీకృష్ణుడు



మండలంలోని దివ్యసాకేతాలయంలో ఏకాదశి పూజలో చినజీయర్‌స్వామి



మండలంలోని అమ్మపల్లి ఆలయంలో దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు



శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో పూజలు చేసిన భక్తులు

శంషాబాద్ రూరల్: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శనివారం మండలంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నర్కూడ శివారులోని అమ్మపల్లి(శ్రీసీతారామచంద్రస్వామి) ఆలయం, ముచ్చింతల్ సమీపంలోని దివ్యసాకేతాలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూలో నిలబడ్డారు. శ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో దివ్యసాకేతాలయంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మపల్లి ఆలయం ఆవరణలో అలంకరణతో పాటు భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జీయర్ స్వామి భక్తులకు ప్రవచనం చేశారు.

మణికొండ: ముక్కోటి, వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు వైష్ణవాలయాలకు తరలిరావటంతో కిటకిటలాడాయి. మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీలోని గోల్డెన్ టెంపుల్, ఓయూ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరాలయం, పుప్పాలగూడ లక్ష్మీనరసింహా నగర్ కాలనీలోని శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవాలయం, నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవులలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయాలకు శనివారం ఉదయం 5 గంటల నుంచే భక్తులు పోటెత్తారు. దాంతో కిలోమీటర్ల దూరం క్యూలైన్లు ఏర్పడ్డాయి. ప్రత్యేక పర్వదినం, భక్తుల తాకిడి ఉంటుందనే ఉద్దేశంతో ఆయా దేవాలయాలలో ప్రత్యేక పూజలను నిలిపి భభక్తులకు నేరుగా దర్శనం కలిగించారు. వైకుంఠ ఏకదాశి రోజు శ్రీమహా విష్ణువు వైకుంఠంలో ఉండి ముక్కోటి దేవుళ్లతో పాటు భక్తుల కోరికలు, సమస్యలు విని వాటిని పరిష్కరిస్తాడనే నమ్మకంతో ఉత్తర ద్వారం గుండా వెళ్లి దర్శనం చేసుకుంటారు. భక్తులు పెద్ద మొత్తంలో తరలిరావటంతో భారీ క్యూలైన్లు ఏర్పడటంతో పాటు దర్శనాలకు సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా దేవాలయాల కమిటీ ఏర్పాట్లు చేయగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



రాజేంద్రనగర్ వెంకటేశ్వర ఆలయంలో పోటెత్తిన భక్తులు



కాటేదాన్ వెంకన్న గుట్ట వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకుంటున్న భక్తులు

శంషాబాద్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వివేకానంద గుప్తా, ప్రధాన కార్యదర్శి చింతల నందకిశోర్ గుప్తా, ఉపాధ్యక్షుడు మధుసూదన్, సోమ సర్వేశ్వర్ రావు, కొత్త ధర్మగుప్తా, ఆకుల రవి, మెట్టు రమేష్, నల్లవెల్లి శ్రీను, వేణుగోపాల్, శంకర్ గుప్తా, అరుణప్ప, గోపాల చారి, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు వెంకటేశ్వర స్వామి దేవాలయాలలో భక్తులతో కిక్కిరిసాయి. శనివారం తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో దేవాలయాలు భక్తులతో సందడిగా కనిపించాయి. రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి, ఎర్రబోడ, శివరాంపల్లి, బుద్వేల్, కాటేదాన్, టీఎన్జీవోస్ కాలనీలలో దేవాలయాలను చూడ ముచ్చటగా అలంకరించారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఆలయ నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశామన్నారు.



మంచిరేవుల వేణుగోపాలస్వామి దేవాలయంలో దర్శనాలకు వేచి ఉన్న భక్తులు



మణికొండ సెక్రటేరియట్ కాలనీలో ఉత్తర ద్వారం నుంచి వెళుతున్న భక్తులు



ఓయూ కాలనీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు



పుప్పాలగూడ గోల్డెన్ టెంపుల్ వద్ద బారులు తీరిన భక్తులు

చెత్త రహితంగా తీర్చిదిద్దుతాం



వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు అందరి సహాయ సహకారాలు ఎంతో అవసరమని కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శనివారం ఉదయం కార్పొరేషన్ పరిధిలోని 19, 20వ డివిజన్‌లో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. డోర్ టూ డోర్ చెత్త సేకరణ వంద శాతం చేయలన్నారు. ప్రజలు కూడా ఇంటి నుంచి వచ్చే చెత్తను రోడ్లపై పడేయవద్దు అన్నారు. బాధ్యతతో చెత్త ఆటో రిక్షా కార్మికులకు అందించి సహకరించాలన్నారు. 20వ వార్డు కార్పొరేటర్ సాగర్‌గౌడ్ పలు సమస్యలను కమీషనర్‌కు వివరించారు. వీధి విక్రయదారుల మార్కెట్ సమస్య, ప్రభుత్వ పాఠశాలలో సమస్యలను, సీసీ రోడ్డు సమస్యలను పరిష్కరించాలని ఆయనకు విన్నవించారు. త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ జవాన్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొండుపల్లి పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభం



సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు మధుకర్

శంషాబాద్: పట్టణంలోని తొండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. లియో స్వచ్ఛంద సంస్థ సహకారంతో దీనిని ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు మధుకర్ తెలిపారు. దీంతో పాటు గణిత శాస్త్రవేత్త రామానుజం జయంతి సందర్భంగా గణిత క్విజ్‌లో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పారెపల్లి శ్రీనివాస్‌గౌడ్, లియో సంస్థ ప్రతినిధులు అరాఫత్, కిరణ్, విద్యాకమిటీ చైర్‌పర్సన్ అమృత, ఉపాధ్యాయులు అనంతరెడ్డి, శంకర్, పరివర్ధన్‌రెడ్డి, భాస్కర్, కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కేక్ మిక్సింగ్ వేడుకలు



కేక్ మిక్సింగ్‌లో పాల్గొన్న నటులు

మణికొండ: ఆడపిల్లల భద్రతకు బరోసా ఇవ్వటమే లక్ష్యంగా పని చేస్తున్న ఆపిల్ హోం రియల్‌నీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం క్రిస్మస్ కార్నివాల్, కేక్ మిక్స్, మింగిల్ ఈవెంట్‌ను నిర్వహించారు. నార్సింగిలని ఓం కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సినీ, టీవీ నటులు సత్యంరాజేష్, శుభలేఖ సుధాకర్, కోన వెంకట్, బీవీఎస్ రవి, వేగశ్రీ జ్యువెలర్స్ స్పందనలు ఉల్లాసంగా పాల్గొన్నారు. అభిజిత్ దేశ్ పాండే స్టాండ్ అప్ కామెడీ, మహిళా డీజే పూజా, డీజే ఎస్‌ఏడీ ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. బ్రాండ్‌ల షాపింగ్ స్టాల్స్, రుచికరమైన ఆహారపానియాల స్టాల్స్‌ను అతిథులు ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపకురాలు నీలిమ ఆర్య అతిథులను సత్కరించారు.

గో సేవకులకు చేయూత



కార్మికులకు దుప్పట్లను అందజేస్తున్న వీఫర్‌యు సంస్థ ప్రతినిధులు

మణికొండ: అనునిత్యం వందలాది గోవులకు సేవ చేసే కార్మికులకు మణికొండ వీఫర్‌యు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చేయూతను అందించారు. నార్సింగి శ్రీ కృష్ణ గోశాలలో పనిచేస్తున్న 60మంది కార్మికులకు దుప్పట్లు, ఫలహారం ప్యాకెట్లను అందజేసారు. సంస్థ అధ్యక్షుడు బాపూజీ మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే వారు, సమాజంలో అట్టడుగున్న ఉన్న వారికి తమ వంతుగా సహాయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ కార్యదర్శి సీతారాందాస్, కోశాధికారి ఆర్.కుమార్‌రావు, సభ్యులు నిర్మల్, దిలిప్‌కక్కడ్, సాంబశివరావు, నాగేంద్ర, శివరామకృష్ణ, ప్రభావతి పాల్గొన్నారు.

భగవద్గీతను చదవాలి



మణికొండ: ప్రతి ఒక్కరు పరమ పవిత్ర గ్రంథం అయిన భగవద్గీతను చదవి అందులోని సారాలకు అనుగుణంగా జీవించాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం గీతాజయంతిని పురస్కరించుకుని మణికొండ పార్వతీరామ లింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు భగవద్గీతలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో పుట్టుక నుంచి చనిపోయే వరకు ఎదురయ్యే సంఘటనలన్నీ భగవద్గీతలో ఉన్నాయన్నారు. వాటిని క్షున్నంగా అర్థం చేసుకుని జీవిస్తే ఎలాంటి ఆటుపోట్లు ఎదురుకావన్నారు. ఆవిషయాన్ని దృష్టిలో ఉంచుకునే కేంద్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి భగవద్గీత, రామాయణాలను పాఠ్యాంశాలుగా చేర్చిందన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం. రాఘవరెడ్డి, అయ్యప్ప మాలాధారులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు



శంషాబాద్ రూరల్: ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా చొరబడి మట్టిని తరలిస్తున్న వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సయ్యద్‌గూడ రెవెన్యూలోని సర్వే నంబర్లు 24/35, 24/44లో ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిలోంచి భారీ యంత్రాలతో మట్టిని తరలిస్తూ పొలాన్ని చదును చేస్తున్నారు. శనివారం సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవ ఘటన స్థలానికి వెళ్లి పనులు నిలిపివేయించారు. మట్టిని తరలిస్తూ భూమిని చదును చేస్తున్న మహేశ్వరం మండలం పెండ్యాల వాసి శేఖర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావుపై ఆర్‌ఐ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



పాఠశాల నిర్మాణ పనులను ప్రారంభించిన వైస్ చైర్మెన్ వెంకటేష్‌యాదవ్

మణికొండ: పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలను అన్ని రంగాలలో తీర్చిదిద్ది విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మెన్ జి.వెంకటేష్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన మున్సిపాలిటీ కేంద్రం 16వ వార్డులో రూ.1.35కోట్లతో చేపడుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సరిపడినన్ని గదులను ఇప్పటికే నిర్మాణం ప్రారంభించామన్నారు. దాతలు, ప్రభుత్వ నిధులతో వాటిని నిర్మిస్తున్నామన్నారు. ప్రాథమిక పాఠశాలలోను పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతులను పెంచాల్సిన అవసరం ఎంతో ఉందని భావించి పనులను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి



రివ్యూ మీటింగ్‌లో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులతో ఆయన రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు, పెండింగ్ పనులకు సంబంధించి వీధిదీపాల నిర్వహణ, రోడ్లు, యూజీడీ లైన్, కమ్యూనిటీ హాల్స్, శానిటేషన్, ప్రాపర్టీ టాక్స్ తదితర విషయాలపై చర్చించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. నాణ్యత లోపాలు లేకుండా అధికారులు ప్రత్యేక చోరవ తీసుకోవాలన్నారు. విషజ్వరాలు ప్రభలుతున్న తరుణంలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపరచాలన్నారు. ఆస్తిపన్నును ప్రతి ఒక్కరు చెల్లించేలా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర, కార్పొరేటర్లు చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, ప్రశాంత్‌నాయక్, అస్లాంబిన్ అబ్దుల్లా, ఎం.రాము, సాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ ప్రార్థనలకు సిద్ధమైన మణికొండలోని ది లైఫ్ చర్చి

మణికొండ: ఏసుక్రీస్తు జనన ఇతివృత్తంతో క్రిస్టియన్‌లు నిర్వహించుకునే క్రిస్మస్ పండగను ఘనంగా నిర్వహించుకునేందుకు వారు సిద్ధమయ్యారు. క్రిస్మస్ పండగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించేందుకు గండిపేట మండల పరిధిలోని చర్చిలకు రంగులు, వీదిదీపాలు, స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలతో అందంగా అలంకరించారు. సోమవారం చర్చిలకు వచ్చే వారికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. చర్చిల ముందర ఏసు క్రీస్తు జన్మ ఇతివృత్తాన్ని తెలిపే బొమ్మల కొలువులను ఏర్పాటు చేశారు. మణికొండలోని దిలైఫ్ చర్చిలో జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో బ్రదర్ అనిల్‌కుమార్ పాల్గొని సందేశం ఇస్తారని చర్చి వర్గాలు తెలిపాయి. గండిపేట మండల పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి, మంచిరేవుల, కోకాపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి తదితర గ్రామాలలో నిర్వహించే ప్రార్థనల్లో క్రిస్టియన్‌లు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు

ఆస్తి పన్ను వసూళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: ఆస్తి పన్ను వసూళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ రవికుమార్ బిల్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఉదయం రెవెన్యూఅధికారులు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆస్తీ పన్నును రోజువారి టార్గెట్లుగా విధించుకొని వసూలు చేయాలని ఆదేశించారు. సర్కిల్ పరిధిలోని అయిదు డివిజన్‌లలో 52 కోట్ల 45లక్షల ఆస్తి పన్నులు వసూలు చేయాల్సి ఉందని అన్నారు. ఇప్పటి వరకు 1 కోటి 50లక్షల రూపాయలను వసూలు చేశారని తెలిపారు. 21 కోట్ల రపాయలు పన్నును వసూలు చేసేది ఉన్నదని, మొండి బకాయిలను గుర్తించి వెంటనే నోటీసులు జారీ చేయాలని నోటీసులు ఇచ్చిన పట్టించుకొని వారిని గుర్తించి వారి ఆస్తులను సీజ్ చేయాలని అన్నారు. శనివారం నుంచి సిబ్బందిని విధులలోకి వెళ్లే విధంగా చూడాలన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో బిల్ కలెక్టర్‌లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

'మేనేజ్'లో జాతీయ రైతు దినోత్సవం



రైతు దినోత్సవం సందర్భంగా సత్కరించిన రైతులతో అధికారులు

ఏజీవర్సిటీ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనెజ్)లో రాష్ట్రీయ కిసాన్ దివస్, జాతీయ రైతు దినోత్సవం ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ నిజజీవిత అనుభవాలు వాటి వల్ల ఉద్భవించిన విలువైన విషయాలను పంచుకున్నారు. వ్యవసాయంలో విభిన్న సవాళ్లను భిన్నమైన పరిష్కారాలను రూపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న సమస్యలు కార్మికులు కొరత, మార్కెట్ సౌకర్యాలు లేకపోవడం, పంటలను పండించిన తరువాత నిల్వ చేసుకోవడానికి అసరమైన సౌకర్యాలు లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. వీటితో పాటు రైతు ఉత్పత్తిదారుల సంస్థల స్థాపనను ప్రోత్సహించడం, స్వయం సహాయక బృందాలకు మద్దతు ఇవ్వడం వంటి నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని జహీరాబాద్ జిల్లాలోని దత్త గ్రామాలకు చెందిన రైతుల మనోబావాలను తెలియజేశారు. వారి మనోభావాలు, వారికి ఎదురైన సమస్యల గురించి వివరించారు ఈ సందర్భంగా ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నీలా రాణి, డాక్టర్ సునితా తదితరులు పాల్గొన్నారు.